ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0 | కనిష్ఠం : 24.0
5
వనపర్తి
జిల్లా వార్తలు
శనివారం 7 సెప్టెంబరు 2024



కాలుష్య కాసారం

కృష్ణానది నీటిలో పరిమితికి మించి కొలిఫాం బ్యాక్టీరియా

- 50 ఎంపీఎన్ ఉండాల్సింది 1,400 ఎంపీఎన్‌తో తీవ్రస్థాయిలో..
- దిగువకు వెళ్తున్న కొద్దీ నీరు మరింత కలుషితం
- కొద్దిరోజుల కిందట కేంద్ర జలసంఘం అధ్యయనంలో వెల్లడి
- రెండేళ్ల క్రితం పీసీబీ నివేదికలో 240 ఎంపీఎన్ మాత్రమే..
- తాజాగా తుంగభద్రలో శాంపిళ్లలో భారీగా పెరిగిన శాతం



తుంగభద్ర నది

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నీరు జీవజాతికి ప్రాణాధారం.. ఈ భూమి పై లభించే నీటిలో 0.5శాతం మాత్రమే తాగడానికి పనికి వస్తుందని అధ్యయనాలు చెబుతు న్నాయి. ప్రవాహంలో ఉండే నీరు సాధారణంగా స్వచ్ఛమైన నీటిగా పరిగణిస్తారు. ప్రవాహం వివిధ రకాల నేలల నుంచి వస్తుండటంతో అందులో మినరల్స్ ఎక్కువగా ఉంటాయనే అభిప్రాయం ఉంది. కానీ కొన్నాళ్లుగా నదీ ప్రవాహంలో నీరు కూడా కలుషితమవుతుందని, ప్రధానంగా ఇండియాలో ఈ కాలుష్య స్థాయి తీవ్రంగా ఉందని నివేదికలు చెబుతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం నీటి ఆధారంగా నడిచే పరిశ్రమలు నది పరివాహక ప్రాంతాల్లో వెలసి.. కలుషిత నీటిని ప్రవాహంలో వదిలేస్తుండటమేనని తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రధానంగా రెండు నదులు ఉన్నాయి. కృష్ణా, తుంగభద్ర నదుల ఆధారం గా జలచరాలతోపాటు అనేక రకాల వృక్షసంపద, సామాన్య జీవనానికి తాగునీరు, సాగునీరు అందుతోంది.

అలాంటి ఈ రెండు నదుల్లో తీవ్ర స్థాయిలో కలుష్య కారకాలు ఉన్నట్లు నివేదికల్లో తెలుస్తోంది. పరిశ్రమల వ్యర్థాలు కలవడం వల్ల కాపర్, జింక్, కాడ్మియం, నికెల్, క్రోమియం వంటి లోహాల శాతం పెరుగుతోంది. వీటి వల్ల ప్రాణాంతక వ్యాధులు రావడంతో పాటు జలచరాలు, వృక్షసంపదకు కూడా నష్టం వాటిల్లుతోంది. కలుషిత నీటితో సాగుచేసిన మొక్కలపై కూడా ఈ ప్రభావం పడుతోంది. రెండేళ్ల క్రితం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వివిధ ప్రాంతాల్లో సేకరించిన శాంపిళ్లను పరీక్షించగా.. గద్వాల బ్రిడ్జి ప్రాంతంలో సేకరించిన శాంపిళ్లలో కాలుష్య కారకాలు ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఈ సంవత్సరం తుంగభద్ర నదిలో బావపురం వద్ద శాంపిళ్లను కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో సేకరించి పరీక్షించగా.. వాటి తీవ్రత అత్యంత ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఇది స్థానిక అధికారుల కు, పొల్యూషన్ బోర్డుకు తెలియంది కాకపోయినా.. కాలుష్య కారకాలుగా పరిగణిస్తున్న ఫ్యాక్టరీలపై చర్యలు మాత్రం తీసుకోవడం లేదు.



బీచుపల్లి వద్ద ప్రవహిస్తున్న కృష్ణానది

తాగు, సాగునీరు కలుషితం..

కృష్ణానది, తుంగభద్ర నదులు ఎగువ రాష్ట్రాల్లో మొదలై.. తెలంగాణ, ఏపీలకు చేరుకుంటాయి. తుంగ భద్ర నది సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో కలిసి పోతుంది. ఇటు కృష్ణా పరివాహకంతోపాటు తుంగ భద్ర నది నుంచి వస్తున్న నీటిలో వ్యర్థాలు కలవడం ద్వారా నీరంతా కలుషిత మవుతుందని నిపుణులు తెలియజేస్తున్నారు. కృష్ణానది నీటితో లక్షలాది ఎకరాల కు తాగునీరు.. లక్షల మందికి తాగునీరు అందుతోంది.. హైదరాబాద్‌కు నీటిని తరలించే ప్రధానమైన పంప్ హౌజ్‌లు కృష్ణానది ఆధారంగానే పనిచేస్తున్నాయి. అలాంటింది కృష్ణానది కలుషితం కావడం.. వాటిని ప్రజలు తాగుతుండటంతో పరిస్థితి ఆందోళనకరంగా తయారైంది. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న పలు కంపెనీల నుంచి ఈ వ్యర్థాలు భారీగా నది లో కలుస్తున్నాయి. లిక్కర్, సబ్బుల ఫ్యాక్టరీలు, అల్క హాల్ ముడిసరుకు తయారయ్యే ఫ్యాక్టరీలు ఈ సరిహద్దుల్లో ఎక్కువగా ఉన్నాయి. పేరుకు కొన్ని ఏపీలో, కొన్ని తెలంగాణలో ఉన్నప్పటికీ కలుషిత వ్యర్థాలన్నీ తుంగభద్రలో కలవాల్సిం దే.. ఈ నదులకు ప్రవాహం తక్కువగా ఉన్న రోజుల్లో పలు ఫ్యాక్టరీల నుంచి వస్తున్న వ్యర్థాలతో నాగర్‌కర్నూలు జిల్లాలోని కొల్లాపూర్ సోమశిల, మంచాలకట్ట, అమరగిరి వద్ద కృష్ణానది మొత్తం ఆకుపచ్చ రంగులోకి మారుతోంది. సాధారణంగా కంపెనీల నుంచి వస్తున్న వ్యర్థాలను రీసైక్లింగ్ చేయాలంటే భారీ ఖర్చుతో కూడుకున్న పని.. వ్యర్థాల శుద్ధి ప్లాంట్లను పెట్టాలి. అంత ఖర్చు చేస్తే మిగిలేది తక్కువ ఉంటుందని భావిస్తున్న పలువురు పరిశ్రమ ల నిర్వాహకులు.. నేరుగా సమీపంలో ఉన్న నదుల్లోకి కలుషిత జలాలను వదులుతున్నారు. గతంలో నేరుగా కాలువ ద్వారా వ్యర్థాలను వదలడం వల్ల ఆరోపణలు, విమర్శలు తీవ్రం కావడంతో పరిశ్రమల నిర్వాహకులు అండర్‌గ్రౌండ్‌లో పైప్‌లైన్లు ఏర్పాటు చేసి.. నదీ మధ్య లో ఎక్కడో ఓ చోట వదులు తున్నారు. గతంలో బ్రిడ్జి సమీపంలో పీసీబీ శాంపిళ్లు సేకరించగా.. కొలిఫాం బ్యాక్టీరియా శాతం 50 ఎంపీ ఎన్ కు గాను 240 ఎంపీఎన్ గా నమోదైంది.

1400 ఎంపీఎన్ శాతం..

నీటిలో అసలు కొలిఫాం బ్యాక్టీరియా ఉండకూడదు. ఒకవేళ ఉంటే అది 50 ఎంపీఎన్ (మోస్ట్ ప్రాపబుల్ నెంబర్)కు దాటకూడదు. కానీ కేంద్ర జలసంఘం తుంగభద్ర నదిలోని భవాపురం వద్ద తీసుకున్న శాంపిళ్లలో 1,400 ఎంపీఎన్ కొలిఫ్యాం బ్యాక్టీరియా నమోదైంది. రెండేళ్ల క్రితం పీసీబీ గద్వాల బ్రిడ్జి సమీపంలో చేసిన శాంపిళ్లలో 240 మాత్రమే నమోదైంది. అంటే తుంగభద్ర నదిలో కాలుష్యం తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు అర్థమవుతోంది. దిగువకు వెళ్లే కొద్దీ ఈ శాతం పెరుగుతోంది. మూసి, తుంగభద్ర నదులు కృష్ణానదిలో కలవడం ద్వారా దిగువన 1,900 వరకు ఎంపీఎన్ నమోదైంది. ఇది చాలా ఆందోళనకరమని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. వీటితోపాటు టార్బిడిటీ (వ్యర్థాల సాంద్రత) కూడా చాలా ఎక్కువగా ఉంది. టార్బిడిటీ ఎక్కువగా ఉండటం వల్ల నీరు తెట్టల్లాగా పేరుకుపోయి.. రంగు మారుతుంది. సాధారణంగా 1-4 పాయింట్ల వరకు టార్బిడిటీ ఉండాలి. తుంగభద్రలో 40శాతం టార్బిడిటీ నమోదైంది. డిసాల్వ్‌డ్ ఆక్సిజన్ (డీఓ) కనీసం 4 మిల్లీగ్రాములు లేదా అంతకంటే ఎక్కువగా ఉండాలి. తుంగభద్ర వద్ద సేకరించిన శాంపిళ్లలో కేవలం 2.9 మాత్రమే ఉంది. అలాగే బీఓడీ (బయాలాజికల్ ఆక్సీజన్ డిమాండ్) లీటర్ నీటిలో 3 మి.గ్రాములు కంటే తక్కువగా ఉండాలి. బీఓడీ పెరిగితే డీఓ తగ్గుతుంది. దాదాపు కృష్ణా బేసిన్‌లో 13 ప్రాంతాల్లో శాంపిళ్లు సేకరించగా.. ఎక్కడ కూడా ఉండాల్సిన స్థాయిలో నాణ్యత లేదని వెల్లడైంది. పరిశ్రమలు, జనసముహాలు చేస్తున్న కాలుష్యాన్ని అరికట్టకపోతే భవిష్యత్‌లో చాలా ఇబ్బందులు ఉంటాయని నివేదిక తెలియజేస్తోంది.

పాత భవనాన్ని కూల్చేయండి

- పీటీజీ తరగతి గదులను మరమ్మతు చేయాలి
- రాష్ట్ర గిరిజన గురుకులాల కార్యదర్శి సీతామహాలక్ష్మీ



మన్ననూరు పీటీజీ గురుకుల పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న సీతా మహాలక్ష్మీ

మన్ననూర్, సెప్టెంబరు 6 : పాత భవనాన్ని కూల్చేయండి.. నూతన భవనంలోని తరగతి గదులను మరమ్మతు చేయండని రాష్ట్ర గిరిజన గురు కులాల కార్యదర్శి సీతామహాలక్ష్మీ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్న నూరులోని ఆదిమవాసీ గురుకుల విద్యాలయాన్ని (పీటీజీ) ఆమె శుక్రవారం ఆక స్మికంగా తనిఖీ చేశారు. పీటీజీకి రెండు భవనాలు ఉన్నాయి. ఇకటి పురాతనమైంది. మరొకటి ఇటీవల నిర్మించింది. ఈ రెండు భవనాలను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్న భవనం లోని ఒక గది వర్షాలకు కూలింది, మరికొన్ని తరగతి గదులను కూడా మరమ్మ తులు చేయాల్సి ఉన్నవి. వీటిని పరిశీలించిన ఆమె శిథిలావస్థలో ఉన్న ఈ పాత భవనాన్ని పూర్తిగా కూల్చి వేయాలని, మిగతా గదులను మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. పీటీజీ విద్యార్థులకు ఆటవిడుపు కోసం కిన్నెర గార్డెన్‌ను నిర్మించాలని, అందుకు తగిన నిధులను మంజూరు చేయను న్నట్లు తెలిపారు. తరగతి గదులకు మరమ్మతులు చేసే క్రమంలో విద్యార్థులకు పక్కనే ఉన్న ఆర్‌ఐటీఏ భవనంలో తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు అవసరమయ్యే బాత్ రూమ్, టాయిలెట్‌లను 15 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం, పోషక విలువలుండే స్నాక్స్ ఇవ్వాలన్నారు. పీటీజీలోని 3,7వ తరగతి, కళాశాల విద్యార్థులతో విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థు లకు చదువుతో పాటుగా శారీరక వ్యాయామం, యోగా, క్రీడల్లోనూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గురుకులం భవన నిర్మాణాలకు అవసరమయ్యే నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ రోహిత్ గోపిడి, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ వెంకటేశ్వర సింహ్, ఏఈ రఘు, పీటీజీ ప్రిన్సిపాల్ గోవర్ధన్ పాల్గొన్నారు.

ఇరుపక్షాల దాడి కేసులో

ముగ్గురికి జైలుశిక్ష

ఆత్మకూరు, సెప్టెంబర్ 6 : ఇరుపక్షాల దాడి కేసులో ముగ్గురికి నాలుగు నెలల జైలుశిక్షరూ.500 జరిమానా విధించినట్లు ఆత్మకూరు ఏఎస్ఐ బీచ్ పల్లయ్య తెలిపారు. ఈసందర్భంగా ఆయన విలేక రులతో మాట్లాడారు. సెప్టెంబర్ 11, 2018న మూ లమల్ల గ్రామానికి చెందిన గుడిసెకృష్ణయ్య కుటుం బ సభ్యులు తమ ఇంటి ముందు సెప్టిక్ ట్యాంక్ నిమిత్తం గుంతను తవ్వారు. ఆదే గ్రామానికి చెం దిన ఇంటి ముందరి వ్యక్తి వల్లూరి ఆశన్న, శ్రీను, మహేందర్ గుంత ఎందుకు తవ్వావని దుర్భాష లాడుతూ గుడిసె కృష్ణయ్య సాగర్, సతీష్, గోపాల్, రాధమ్మపై దాడి చేసి గాయపరచడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని తెలిపారు. కాగా శుక్రవారం ఆత్మకూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శిరీష వాదోపవాదాలు విన్న అనంతరం వల్లూరి ఆశన్న, మహేందర్, శ్రీనివాసులుకు ఒక్కొక్కరికి నాలుగు నెలల పాటు జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆటో కింద పడి చిన్నారి దుర్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 6 : టాటా ఏస్ ఆటో కిందపడి చిన్నారి కావ్య(4) మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తాడూరు మండలం చెర్లటిక్యాలకు చెందిన మల్లేష్ కుటుంబ సభ్యులతో కలిసి పట్టణంలోని పాపయ్యనగర్ కాలనీలో అద్దెకు ఉంటున్నారు. మల్లేష్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. సాయంత్రం సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి ఆవరణలో ఉండగా, చిన్న కుమార్తె కావ్య ఇంటి ముందు రోడ్డుపై ఆడుకుం టుండగా అదే సమ యంలో ఓ టాటాఏసీ ఆటో డ్రైవర్ గమనించకుం డా నేరుగా వచ్చి చిన్నారిని ఢీకొట్టాడు. వెంటనే కుటుంబ సభ్యులు కావ్యను జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎస్ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.



అధికారులకు మట్టి గణపతులను అందజేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి

గణేష్ ఉత్సవాలకు రెడీ

- మండపాలకు చేరుతున్న విగ్రహాలు


వనపర్తి రాజీవ్‌చౌరస్తా, సెప్టెంబరు 6 : వినాయక చవితి వేడుకల కోసం గణనాథులను భక్తులు మండపాలకు తరలిస్తున్నారు. నేటి నుంచి ప్రారంభమయ్యే వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భక్తులు రూ.వేలు వెచ్చించి ఆకర్షణీయమైన వినాయకులను కొనుగోలు చేసి మండపాలకు తర లిస్తున్నారు. భాజభజంత్రీలు, డీజే పాటలతో యువకులు ఉత్సాహంగా గణనాథులను తమ కాలనీలు, గ్రామాలకు తీసుకెళ్తున్నారు. ఇదిలా ఉంటే గణనాథులు కొలువుదీరేందుకు భక్తులు మండపాలను ప్రత్యేక అలంకరణలతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. రూ.వేల నుంచి లక్షల వరకు మండపాల నిర్మాణానికి ఖర్చు చేస్తున్నారు. డెకరేషన్ ఏర్పాటు, డీజే లైట్లు, తదితర హంగుల కోసం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. కొన్ని చోట్ల భక్త బృందాలే చందాలు వేసుకుని మండపాలను ఏర్పాటు చేయగా మరికొన్ని చోట్ల దాతలు మండపాల ఏర్పాటు కు ముందుకు వస్తున్నారు.



జిల్లా కేంద్రంలో గణనాథుడి విగ్రహాన్ని మండపానికి తీసుకెళ్తున్న భక్తులు

మట్టి గణపతులను పంపిణీ చేసిన కలెక్టర్

కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభి శుక్రవారం జిల్లా అధికారులకు, ఉద్యోగులకు మట్టి గణపతులను అందజేశారు. మట్టి గణపతులతో పర్యావరణానికి మేలు జరుగుతుందని ఆయన సూచించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, రెవెన్యూ అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఆవంచలో వెలసిన ఐశ్వర్య గణపతి

దేశంలోనే అతిపెద్ద వినాయకుడు

- ఆవంచలో వెలసిన ఐశ్వర్య గణపతి

తిమ్మాజిపేట : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని ఆవంచలో వెలసిన ఐశ్వర్య గణపతి దేశంలోని అతిపెద్ద వినాయకుడి విగ్రహంగా చెప్పుకుం టారు. క్రీస్తుపూర్వం 1175లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన పశ్చిమ చాళుక్యుల వంశస్థుడైన తైలంపుడు ఏకశిలపై 30 అడుగుల వినాయకుడి ప్రతిమను చెక్కించినట్లు పురాణాలు చెబుతున్నాయి. దుందుభి నది ఒడ్డున ఊరికి సమీపంలో ఉన్న ఐశ్వర్య గణపతిని చవితి రోజు న దర్శించుకునేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తుంటారు.

మండలంలో భారీ వర్షం

- రోడ్డుపైకి వరద
- గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నీట మునిగిన పంటలు

గోపాల్‌పేట, సెప్టెంబరు 6 : బంగాళాఖాతంలో ఏర్ప డిన అల్పపీడనం వల్ల మండలంలో గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చెరువు లు, కుంటలు పొంగి పొర్లుతు న్నాయి. రోడ్లపైకి వరద ఉధృతం గా ప్రవహించడంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపో యాయి. రైతులు కోలుకునేలోపే వర్షం రూపంలో మరో ఎదురు దెబ్బ ఎదురైంది. గురువారం అర్ధ రాత్రి రెండు గంటల సమయం లో రెండు గంటలపాటు కురిసిన భారీ వర్షానికి వందలాది ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. మండలంలో గురువారం ఒక్క రాత్రే దాదాపు 70 మిల్లీమీటర్ల వర్షం కురిసిందని అధి కారులు తెలిపారు. చెరువులు, కుంటలు ముందే నిండ డంతో అలుగులో నీరు అధికమై రైతుల పొలాల మీదు గా పారాయి. మండలంలో పూలవాగు ఉధృతంగా ప్రవ హిస్తోంది. చెన్నూర్, గోపాల్‌పేట, పొలికెపాడు, తాడి పర్తి, మున్ననూర్, ఏదుట్ల, చాకల్‌పల్లి గ్రామాల్లో వరి పంటలు నీట మునిగాయి. ఈ వర్షాలు ఇలాగే కొనసా గితే తీవ్ర పంట నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవే దన వ్యక్తం చేశారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న పూలవాగు

జేపీనగర్ గురుకులంలో అధ్యాపకులను నియమించాలి



కళాశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కల్వకుర్తి, సెప్టెంబరు 6 : కల్వకుర్తిసమీపంలోని జేపీనగర్ ఎస్సీ బాలుర గురుకులం (జూనియర్ కళాశాల)లో అధ్యాపకులను వెంటనే నియమించాలని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయ ఇంటర్ విద్యార్థులు తరగతులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. గురుకులంలో ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న అధ్యాపకులను సొసైటీ తొలగించిందని విద్యార్థులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు విద్యార్థులతో మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్య పరి ష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

మునిసిపల్ అధికారులపై కౌన్సిల్ సభ్యుల అసంతృప్తి

- హైదరాబాద్‌లో డీఎంఏకు ఫిర్యాదు - పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం.. కమిషనర్ సరెండర్ అంశం ప్రస్తావన



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

వనపర్తి టౌన్, సెప్టెంబరు 6: వన పర్తి మునిసిపల్ అధికారుల తీరుపై అధికార పార్టీ కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమయపాలన పాటించడం లేదని, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తూ మునిసిపాలి టీకి రావాల్సిన ఆదాయం సమకూర్చు కోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని కౌన్సిల్ సభ్యులు గుర్రుగా ఉన్నారు. రెవెన్యూ విభాగం, టౌన్ ప్లానింగ్ అ ధికారుల పనితీరుతో మునిసిపాలి టీకి ఆదాయం ఆశించినంత మేర జమకావడం లేదనేదే కౌన్సిల్ సభ్యుల వాదన. ఫలితంగా అధికారుల తీరుపై మునిసిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణతో పాలు పలువురు కౌన్సిలర్లు శుక్రవారం హైదరాబాద్‌లోని డీఎం ఏను కలిసి ఫిర్యాదుచేశారు. రెవెన్యూ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సరెండర్ అంశం ప్రస్తావన

వనపర్తి మునిసిపల్ సాధారణ సమావేశం గురువారం చైర్మన్ పుట్ట పాకల మహేష్ ఆధ్వర్యంలో నిర్వ హించిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో కమిషనర్ పూర్ణచందర్ పనితీరుపై మెజారిటీ కౌన్సిల్ సభ్యు లు అభ్యంతరం వ్యక్తం చేయగా, వైస్ చైర్మన్ పాకనాటికృష్ణ సరెండర్ చే యాలని తీర్మానం ప్రవేశపెట్టగా స భ్యులు ఆమోదించారు. అనంతరం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అంతటితో ఆగకుండా శుక్ర వారం డీఎంఏను కలిశారు. కార్యక్ర మంలో వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కౌన్సిలర్లు బాపనిపల్లి వెంకటేష్, నక్క రాములు, సత్యంసాగర్, ఎల్ఐసీ కృష్ణ, గంధం శరవంద తదితరులు ఉన్నారు.

జీఎంఆర్‌కు పలువురి పరామర్శ



చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్‌లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

చిన్నచింతకుంట/పెబ్బేరురూరల్, సెప్టెంబరు 6- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తం డ్రి కృష్ణారెడ్డి మృతిచెందిన విషయం తెలిసిందే. శుక్ర వారం చిన్నచింతకుంట మండలంలోని దమగ్నాపూర్‌లోని ఆయననివాసంలో పరిగి ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రె డ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, నారాయణపేట కాంగ్రెస్ నాయకులు కంభం శివకుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కుటుంబీకులను పరామర్శించారు. అదేవిధంగా వనపర్తి జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్‌యాద్ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని పరామర్శించి, మృతిచెందిన కృష్ణారెడ్డికి నివాళులర్పించారు. ఆయనవెంట రాములుయాదవ్, వెంకట్‌రాములు, సహదేవుడు ఉన్నారు.

రామన్‌పాడు గేట్లు ఎత్తడంతో కొట్టుకుపోయిన వలలు

రూ.20 లక్షలకు పైగా ఆస్తినష్టం - మత్స్యకారుల ఆందోళన



మత్స్యకారులను శాంతింపజేస్తున్న పోలీసులు

ఆత్మకూరు, సెప్టెంబరు 6 : రామన్‌పాడు రిజర్వాయర్ గేట్లు ఒక్కసారిగా ఎత్తివేయడంతో సుమారుగా రూ.20 లక్షల ఆస్తినష్టం జరిగిందని ఆత్మకూరు, మదనాపూర్ మండలాల మత్స్యకారులు రామన్‌పాడు రిజర్వాయర్ వద్ద రహదారి గేట్లు మూసివేసి శుక్రవారం ధర్నా నిర్వహించి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీరోజు సాయంత్రం నాలుగు గంటల సమయంలో మత్స్యకారులు రామన్‌పాడు బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లి వలలు వదిలి ఉదయం వలలకు చిక్కుకున్న చేపలను క్రయ విక్రయాలు జరుపుతు జీవనం సాగిస్తున్నారు. అదే మాదిరిగానే గురువారం సాయంత్రం రామన్‌పాడు బ్యాక్ వాటర్‌లో చేపల వేట నిమిత్తం ఆత్మకూరు, బాలకృష్ణాపూర్, కొత్తపల్లి, గోపాన్‌పేట, రామన్‌పాడు, అజ్జకోలు గ్రామాల వారు వలలు వదిలారు. ఉదయం వచ్చే వరకు ఒక్కసారిగా గేట్లు ఎత్తివేయడంతో ఆయా గ్రామాల మత్స్యకారుల వలలు కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తూ రిజర్వాయర్‌పై ఉన్న రహదారి గేట్లు మూసివేసి ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో మదనాపూర్ పోలీసులు కలుగజేసుకుని మదనాపూర్ వాగు వద్ద వరద రావడంతో రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

ఇటువైపుగా వనపర్తి జిల్లా కేంద్రానికి వందల సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. కావునా దారి వదలాలని పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మత్స్యకారులు శాంతించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపల్లిలో వ్యక్తి ఆత్మహత్య

తిమ్మాజిపేట, సెప్టెంబరు 6: మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో ఎర్రోళ్ల బాలస్వామి(50) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నాళ్లుగా భార్య స్వరూప, తన ఇద్దరు పిల్లలతో తల్లిదండ్రుల దగ్గర ఉంటుంది. ఎంతచెప్పినా పోతిరెడ్డిపల్లికి రావడంలేదు. దీంతో మనస్తాపంతో తాగుడుకు బానిసై తిరుగుతున్నాడు. ఈ క్రమంలోనే ఇంటి ఆవరణలోని రేకులషెడ్డులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని భార్యకు, వేరే గ్రామానికి వెళ్లిన తండ్రికి గ్రామస్తులు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల ఆసుపత్రికి తరలించామన్నారు.

పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై హర్షం

మూసాపేట, సెప్టెంబరు 6 : టీపీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్ ఎంపిక పట్ల కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం బడుగు, బలహీన వర్గాల సంక్షేమాభివృద్ధికి బీసీ అభ్యర్థికి పదవి కేటాయించారని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి శేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామన్‌గౌడ్, మండల నాయకులు రాంచందర్, మహేందర్, తిరుపతయ్యగౌడ్, కృష్ణయ్య, నిరంజన్, ఖలీల్, నారాయణ ఉన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈవో



వేపూర్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

హన్వాడ, సెప్టెంబరు 6 : పదవ తరగతిలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని డీఈవో రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మునిమోక్షం, గొండ్యాల, వేపూర్ జెడ్పీహెచ్ పాఠశాలలను డీఈవో ఎ.రవీందర్ పరిశీ లించారు. అయాపాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థులకు అర్థమయ్యేవిధంగా పాఠాలు చెప్పి మంచి ఫలితాలు వచ్చేందుకు కృషి చేయాలని వివరించారు.

విద్యార్థులను పాఠ్యపుస్తకాలలోని ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. అయన వెంట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఇంటర్వ్యూలు

మహబూబ్‌నగర్ అర్బన్, సెప్టెంబర్ 6: జిల్లాలోని మైనార్టీ గురుకులాల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4ఉపాధ్యాయ పోస్టులకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలుర-1,2లో డెమో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జడ్చర్ల బాలిక ల-1లో పీజీటీ మ్యాథ్స్, జిల్లా కేంద్రంలోని బాలి కల-2లో పీజీటీ బయోసైన్స్, బాలికల-3లో పీజీ టీ బయో సైన్స్, బాలుర-1లో టీజీటీ ఉర్దూ ఔ ట్ సోర్సింగ్ పోస్టులకు డెమె ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు జిల్లా రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ (ఆర్ఎల్‌సీ)ఖాజాబహోద్దీన్ తెలిపారు. ఉర్దూ పోస్టుకు సంబంధించి 48 మంది దరఖాస్తు చేసుకోగా, 31 మంది అర్హత సాధించగా, 25మంది హాజరైయ్యారు. బయోసైన్స్ 41 మంది దరఖాస్తు చేసుకోగా, 21 మంది అర్హత సాధించగా, 11మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా, మ్యాథ్స్ 25 మంది దరఖాస్తు చేసుకో గా, 13 మంది అర్హత సాధించగా 8మంది హాజరయ్యారు. సీనియారిటీ, మెరిట్, ప్రతిభ ఆధారంగా ఎంపిక ఉంటుందని ఆర్ఎల్‌సీ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- నలుగురికి తీవ్ర గాయాలు



డివైడర్‌ను ఢీకొని పూర్తిగా దెబ్బతిన్న కారు

భూత్పూర్, సెప్టెంబరు 6: కారు అదుపు తప్పి జాతీయ రహదారిపై డివైడర్‌ను ఢీకొనగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని పోతులమడుగు శివారులో 44వ నెంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. స్థానికుల, పోలీసుల తెలిపిన వివరాలు ఇలా.. చిత్తూరు జిల్లా, మదనపల్లి పట్టణానికి చెందిన మహేందర్‌రెడ్డి, భార్య అర్పినా, ఏడాది వయస్సున్న కుతూరు మహిరా, అత్తా, మామలు అంజద్‌అలీఖాన్, గులాబీ ఐదుగురు కలిసి కారులో హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. మహేందర్‌రెడ్డి, భార్య అర్పినా హైదరాబాద్‌లో ఐటీలో పనిచేస్తున్నారు. వీరు సొంత గ్రామానికి వారం రోజుల క్రితం వచ్చి, తిరిగి గురువారం రాత్రి 11గంటలకు హైదరాబాద్ బయలుదేరారు. ఈ క్రమంలో కారును మహేందర్‌రెడ్డి మదనపల్లి నుంచి కర్నూల్ వరకు నడుపుతూ వచ్చాడు. ఆ తర్వాత భార్య నడిపింది. శుక్రవారం తెల్లవారుజామున కారు మండలంలోని పోతులమడుగు వరకు రాగానే యూటర్న్ వద్ద ఎదురుగా (రాంగ్‌రూట్‌లో ఓ గుర్తు తెలియని వాహనం వచ్చింది.) వాహనాన్ని తప్పించబోయి కారు డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. డివైడర్ వద్ద సీసీ కెమెరా స్తంభం ఉండడంతో కారు అక్కడే ఆగిపోయింది. లేకుంటే రెయిలింగ్ మొత్తం కారులో చొచ్చుకొని పోయి ఉంటే ప్రాణ నష్టం జరిగేదని సాక్షులు తెలిపారు. క్షతగాత్రులను 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. వీరిలో గులాబీ అనే మహిళ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



పగిలిపోయిన హుండీ తాళం

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 6: జిల్లా కేంద్రంలోని శ్రీనివాసకాలనీ పంచ ముఖ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తాళాలు పగులగొట్టి నగదు చోరీ చేశారు. నోట్లను తీసుకొని ఆలయ ప్రాంగణం లో చిల్లర వెదజల్లారు. మైకు వైర్లను కట్ చేశారు. ఉదయం 5 గంటలకు పూజా రులు ఆలయానికి రాగా, వారు గమనించి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఘటనా స్థలాన్ని వారు పరిశీలించారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ గాంధీనాయక్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత



ఫోన్లు అప్పగిస్తున్న సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి

వెల్దండ, సెప్టెంబరు 6: మండలంలో ఇటీవల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న పలువురి ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకుని శుక్రవారం బాధితులకు అప్పగించారు. ఫోన్లు పోగొట్టుకున్న రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు చెందిన యాదగిరి, వెల్దండకు చెందిన జితేందర్‌రెడ్డి, మాదారం గ్రామానికి చెందిన మల్లేష్, వనపర్తికి చెందిన గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తన కార్యాలయంలో వారికి ఫోన్లు అప్పగించారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతి

హన్వాడ, సెప్టెంబరు 6: మండలంలోని గొండ్యాల చెందిన చాకలి వెంకప్ప(70) మృతదేహం పొలంలో లభించింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వేపూర్ శివారులోని వరిపంట పొలంలో శుక్రవారం ఉదయం సాకలి వెంకప్ప మృతదేహం కనిపించింది. వృద్ధుడికి మతిస్థిమితం లేక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. రాత్రి కురిసిన వర్షానికి పొలంలో పడి మృతి చెంది ఉంటాడని స్థానికులు తెలిపారు.

భూతగాదాలో ఇరువర్గాలపై కేసు



గాయపడిన రాముడు

ధరూరు, సెప్టెంబరు 6 : భూ తగాదా విషయంలో ఓ వ్యక్తిపై తొమ్మిది మంది దాడి చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలంలోని మన్నాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మన్నాపురం చెందిన కురువ ఊరబావి రాముడుకి చెందిన వ్యవసాయ పొలంలో అకారణంగా చిన్నగోవిందు వర్గానికి చెందిన తొమ్మిది మంది ప్రవేశించి పొలం గట్టును తవ్వుతుండగా, రాముడు వారిని ప్రశ్నించాడు. దీంతో వారు రాముడిపై దాడి చేసి గాయపరిచారు. అదేవిధంగా చిన్నరాముడు వర్గంపై కూడా దాడికి పాల్పడ్డారు. దీంతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ షుకూర్ తెలిపారు.

పొలంలో కట్టేసిన ఎద్దుల అపహరణ

కృష్ణ, సెప్టెంబరు 6: పొలం వద్ద గుడిసెలో కట్టేసిన ఎద్దులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని గూడెబల్లూరు పరిధిలో చోటుచేసుకుంది. రైతు చెవిటోళ్ల వెంకటేష్ తన ఎద్దులను గురువారం సాయంత్రం పత్తిపొలం వద్ద కట్టేశాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా, గుడిసె తలుపులు పగులగొట్టి ఎద్దులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. జోడెద్దులను రూ.1.50లక్షలకు కొన్నట్లు రైతు వాపోయాడు.

అంబులెన్సులో ప్రసవం: తల్లీ, బిడ్డ క్షేమం



బిడ్డను అప్పగిస్తున్న సిబ్బంది

హన్వాడ, సెప్టెంబరు 6: పురిటి నొప్పులతో అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తున్న గర్భిణి మార్గమధ్యలో అంబులెన్సులోనే ప్రసవించింది. గండీడ్ మండలం జులాపల్లికి చెందిన జ్యోతికి శుక్రవారం పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో హన్వాడ అంబులెన్సు జ్యోతిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా, నొప్పులు అధికమయ్యాయి. సిబ్బంది ఇర్ఫాన్, శివశంకర్ అంబులెన్సులోనే ప్రసవం చేశారు. మగ బిడ్డ, తల్లి క్షేమంగా ఉన్నారని, అనంతరం వారిని హన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించినట్లు 108 సిబ్బంది తెలిపారు.

ఏళ్లు గడుస్తున్నా.. పూర్తికాని వంతెన

- సరళాసాగర్ సైఫన్ గేట్లు ఎప్పుడు తెరుచుకుంటాయో తెలియని పరిస్థితి
- ఇప్పటికే వరదలో కొట్టుకుపోయిన ఐదుగురు
- తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న వాహనదారులు



కొత్తకోట- ఆత్మకూరు మధ్యన వంతెన రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద

ఆత్మకూరు, సెప్టెంబర్ 6: ఏళ్లు గడుస్తున్న మదనాపూర్ వాగు వద్ద వంతెన పూర్తి కాకపోవడంతో ఆత్మకూరు, అమరచింత మండలాల వాహనదారులతో పాటు జాతీయ రహదారి, రైల్వే స్టేషన్ ఉండడంతో రోజు వారీగా ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు వనపర్తి జిల్లా కేంద్రానికి ప్రభుత్వ ఉద్యోగులు వెళ్తుంటారు. ఇదే ప్రధాన రహదారి కావడంతో వర్షాకాలం వచ్చిందంటే సైఫన్ తెరుచుకోవడంతో వాగులో వరద పొంగిపొర్లుతున్న కారణంగా వెళ్లే పరిస్థితి లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొనే దుస్థితి నెలకొంది. రెండేళ్ల క్రితం అధిక వర్షపాతం కారణంగా సరళాసాగర్ ఆటోమెటిక్ సైఫన్లు ఓపెన్ కావడంతో ఐదుగురు వరదల్లో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చొరవతో వంతెన నిర్మాణానికి రూ.9.25 కోట్లు వెచ్చించి పనులు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పనులు కొనసాగుతూనే ఉన్నాయి.



వాగు దారిపై మరమ్మతుల నిమిత్తం వేసిన మట్టి

ధ్వంసమైన వాగు రహదారి

గతేడాదితో పోలిస్తే ఈసారి అధిక వర్షపాతం కారణంగా ఆటోమెటిక్ సైఫన్లు ఒక్కసారిగా తెరుచుకోవడంతో వాగు వద్ద రోడ్డు తీవ్రస్థాయిలో ధ్వంసం అయ్యింది. వంతెన పనులు చేపట్టిన గుత్తేదారులే ప్రస్తుత రోడ్డు మరమ్మతు చేపట్టాల్సిన ఆదేశాలు ఉన్నాయి. రెండు రోజుల క్రితం వరద తగ్గిన కారణంగా ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టినా.. బుధవారం కురిసిన వర్షానికి సైఫన్లు ఓపెన్ కావడంతో మళ్లీ పనులకు అంతరాయం ఏర్పడింది.

ఊక చెట్టు వాగు వంతెనపై భారీగా వరద నీరు

మదనాపురం: మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఊకచెట్టు వాగుపై వరద నీరు ప్రవహిస్తుంది. వంతెనపై ఆత్మకూర్, కొత్తకోట ప్రధాన రహదారి ఉండడంతో శుక్రవారం రాకపోకలు నిలిచాయి. గురువారం సాయంత్రం వరద తగ్గడంతో ధ్వంసమైన రహదారిపై సిమెంట్ డస్ట్ వేశారు. ఆ తర్వాత రాకపోకలు నెమ్మదిగా కొనసాగాయి. వర్షాలు మళ్లీ కురవడంతో సరళాసాగర్ ప్రాజెక్టు మూడు సైఫన్లు తెరుచుకోగా వంతెనపై వరద భారీగా ప్రవహిస్తుంది. దీంతో ప్రయాణికులు రామన్‌పాడు ప్రాజెక్టు మీదుగా రాకపోకలు కొనసాగిస్తున్నారు.

మరమ్మతులకు వరద అంతరాయం



సరళ సాగర్ సైఫన్లు ఓపెన్ కావడంతో వరద ఒక్కసారిగా పెరగడంతో సీసీ రోడ్డు ధ్వంసం అయ్యింది. బుధవారం వరద తగ్గుముఖం పట్టడంతో మరమ్మతు పనులను చేపట్టాం. రాత్రి వర్షం కారణంగా మళ్లీ వరద రావడంతో అంతరాయం ఏర్పడింది. పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు మరమమ్మతు చేపట్టడం కష్టతరంగా మారింది.

- రాకేష్ కుమార్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

ఇబ్రహీంబాద్ వద్ద నిలిచిన రాకపోకలు



ఈదుల బ్రిడ్జి వద్ద తాత్కాలిక రోడ్డుపై పారుతున్న వరద

హన్వాడ: మండలంలోని ఇబ్రహీంబాద్ ఈదుల్ల వద్ద తాండూరు-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై శుక్రవారం భారీ వర్షాలకు రాకపోకలు నిలిచాయి. బ్రిడ్జి నిర్మాణం కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు 1వ తేదీన తెగిపోయింది. అధికారులు గురువారం మరమ్మతు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. తిరిగి శుక్రవారం వర్షం పడడంతో తాత్కాలిక రోడ్డుపై నుంచి భారీగా నీరు పారడంతో దెబ్బతింది. దీంతో మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. ఇబ్రహీంబాద్ నుంచి పుల్వానిపల్లి చిన్న మార్గంలో కోస్గి, తాండూరు, పరిగి ఇతర ప్రాంత్రాలకు వాహనదారులు వెళ్తున్నారు. ఉదయం మహబూబ్‌నగర్ డిపో బస్సులు బ్రిడ్జి వరకు వచ్చి వెనుదిరిగిపోయాయి.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్

- మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి

- శిశు మందిర్‌లో ఆకట్టుకున్న విజ్ఞాన మేళ



విజ్ఞాన ప్రదర్శనను తిలకిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

అమరచింత, సెప్టెంబర్ 6: దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లోనే ఉందని మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఉమ్మడి జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మేధాశక్తి అపారంగా దాగి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు వారి అభిరుచులకు అనుగుణంగా వారిలో ఉన్న మేధాశక్తిని వెలికి తీయాలని సూచించారు. భావిభారత పౌరులుగా ఎదిగి దేశ భవిష్యత్‌ను గాడిలో పెట్టే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. సరస్వతి శిశు మందిరాలు సాంస్కృతిక, సభ్యత , సాంప్రదాయం, కట్టుబాట్లు, క్రమశిక్షణకు మారుపేరని అన్నారు. ఉమ్మడి జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ అమరచింతలో నిర్వహించడం హర్షించదగ్గ విషయమని ప్రతి విద్యార్థి తమ ప్రతిభను ఈ సైన్స్ ఫెయిర్ ద్వారా చాటి చెప్పారని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా గణితం, సైన్స్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను ఆయన తిలకించారు. కార్యక్రమంలో అమరచింత ఎత్తిపోతల సంఘం అధ్యక్షురాలు సౌజన్యరెడ్డి, నాగిరెడ్డి, సూర్యనారాయణ, విజయ్, ఎల్ల బాలస్వామి, రమేష్ నాయక్, మేర్వ రాజు, ఉషన్న, వనపర్తి, గద్వాల్, ఆత్మకూరు, అమరచింత శిశు మందిర్ ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతా అయిపోయింది.. ఇప్పుడొచ్చి ఏం చేస్తారు?

- తహసీల్దార్‌ను చిన్నోనిపల్లిలోకి రాకుండా అడ్డుకున్న ముంపు గ్రామస్థులు, వాగ్వాదం

- కారు దిగకుండానే వెను తిరిగిన అధికారి



తహసీల్దార్ కారును అడ్డుకుంటున్న ముంపు గ్రామస్థులు

గట్టు, సెప్టెంబరు 6 : చిన్నోనిపల్లి రిజర్వాయర్ నిల్వనీటితో ముంపునకు గురైన చిన్నోనిపల్లి గ్రామస్థుల నుంచి గట్టు తహసీల్దార్ సరితారాణికి చేదు అనుభవం ఎదురైంది. ముంపు గ్రామం పరిశీలన నిమిత్తం శుక్రవారం గ్రామానికి చేరుకోగా విషయాన్ని గమనించిన ప్రజలు ఆగ్రహంతో కారును చుట్టుముట్టారు. అంతా అయిపోయాక , ఇళ్లని మునిగి పోయి గ్రామస్థులమంతా తలో దిక్కుకు పోయామని, ఇప్పుడు ఎందుకు వచ్చారంటూ నిలదీశారు. పది రోజులుగా నీరు చేరుతున్నాయని రిజార్వాయర్‌లోని నీటిని బయటకు వదలండని ముంపు గ్రామస్థులం మొత్తుకుంటున్నా మా విన్నపాన్ని ఎవరూ పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం పత్రికల్లో, సోషల్ మీడియాలో వస్తున్నా తమ మొరను ఆలకించలేదని, చివరకు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదని మహిళలు తహసీల్దార్‌పై మండిపడ్డారు. పిల్లా పాపలతో తలో దిక్కు దాచుకున్నామని ఇప్పుడు వచ్చి ఏం చేస్తారంటూ తహసీల్దార్‌ను గ్రామస్థులు ప్రశ్నించారు. అక్కడి పరిస్థితి చేయి దాటిపోతుందని గమనించి కారు దిగకుండానే తహసీల్దార్ వెనుతిరుగాల్సి వచ్చింది.

చదవాలనుందా..!

- ఓపెన్ స్కూల్‌లో చేరండి
- ఉమ్మడి జిల్లాలో 80 స్టడీ సెంటర్లు
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు
- 10వ తేదీ వరకు అవకాశం



తరగతులకు హాజరైన అభ్యర్థులతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ రాంసుభాష్‌గౌడ్ (ఫైల్)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 6 : వివిధ కారణాలతో చదువుకోని వారు, మధ్యలో బడి మానేసిన వారు మళ్లీ చదువుకోవాలని ఉందా.. అయితే ఈ అవకాశం మీకోసమే. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (సార్వత్రిక విద్యాపీఠం) దూర విద్యావిధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 80 స్టడీ సెంటర్లను ఏర్పాటు చేసింది. పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి ఈ నెల 10వ తేదీ వరకు గడువు పెట్టింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సెలవు దినాల్లో నిర్వహించే తరగతులకు హాజరయ్యే అవకాశం కల్పించింది. ప్రతీ ఏడాది ఏప్రిల్, మే నెలలో వార్షిక పరీక్షలు నిర్వహిస్తుంది. ఓపెన్ ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించిన వారు రెగ్యులర్ డిగ్రీలో కూడా చేరే అవకాశం ఉంటుంది.

ఇంటర్ అర్హతతో నిర్వహించే అన్ని పోటీ పరీక్షలకు, ఉద్యోగ పరీక్షలకు రాసుకునే అవకాశం ఉంటుంది. ఇందుకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు చెల్లించి కోర్సులో చేరవచ్చునని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోఆర్డినేటర్ రామ్ సుభాష్‌గౌడ్ తెలిపారు.

అర్హతలు ఇవే..

పదో తరగతి ప్రవేశాలకు 14 ఏళ్లు, ఇంటర్ చదివేందుకు 15 ఏళ్లు నిండి ఉండాలి. పదో తరగతి పూర్తి చేసి, మధ్యలో మానేసిన వారు ఇంటర్ ఫెల్ అయినా వారికి ప్రవేశం పొందే అవకాశం. పది, ఇంటర్ కోర్సులు నాలుగు మాధ్యమాల్లో దేనినైనా ఎంచుకోవచ్చు. సైన్స్ అభ్యర్థులకు ప్రాక్టికల్ పరీక్షలు కూడా ఉంటాయి.

ఫీజు వివరాలు

పదో తరగతి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150 ఉంటుంది. ప్రవేశ ఫీజు ఓపెన్ కేటగిరి పురుషులకు రూ.1,400, స్త్రీలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు, దివ్యాంగులకు రూ.వెయ్యి ఉంటుంది. ఇంటర్మీడియట్‌కు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300, ఓపెన్ కేటగిరి పురుషులకు రూ.1,500, చెల్లించాలి. మిగితా వారికి రూ.1,200 ఉంటుంది. ఫీజులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించి, రశీదు అధ్యయన కేంద్రంలో ఇవ్వాల్సి ఉంటుంది.

మంచి అవకాశం

ఓపెన్ స్కూల్ ద్వారా వయోజనులు, ఉద్యోగాలు చేస్తున్నవారు, చదువు మానేసిన వారికి పది, ఇంటర్‌లో చేరేందుకు మంచి అవకాశం. సెలవు రోజులలో తరగతులు ఉంటాయి. ఉమ్మడి జిల్లాలోని అధ్యయన కేంద్రాల్లో అభ్యర్థులకు అనుకూలంగా ఉన్న తరగతులు వినే సౌకర్యం ఉంది. ఉమ్మడి జిల్లాలో 497 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

- రామ్‌సుభాష్‌గౌడ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోఆర్డినేటర్

జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి బాధాకరం: ఎంపీ డీకే అరుణ

మహబూబ్ నగర్ (క్లాక్ టవర్), సెప్టెంబరు 6: తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి బాధాకరమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ శుక్రవారం ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన పోరాటంలో ఆయన పాత్ర మరవలేనిదని తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఎం సహాయ నిధికి ఎంపీ విరాళం

నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల బాధితులను ఆదుకునేందుకు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి చేయూతనందించారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రజాప్రతినిధులంతా తోడ్పడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఎంపీ తన నెల వేతనం రూ.1.90లక్షలు సీఎం సహాయ నిధికి చెక్కు అందజేశారు.

జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం

గోపాల్‌పేట, సెప్టెంబర్ 6: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమాకాంత్ శుక్రవారం తెలిపారు. విద్యార్థులు శైలజ, స్వరూప శనివారం మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి అసోసియేషన్ సబ్ జూనియర్‌లో రాష్ట్ర జట్టులో వీరు ఆడుతారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పొలంలో గడ్డి కోస్తుండగా.. వైర్లు తాకి మహిళ మృతి



అంజమ్మ (ఫైల్)

కోయిలకొండ, సెప్టెంబరు 6: పశువుల కోసం పొలంలో గడ్డి కోస్తుండగా వైర్లు తాకడంతో షాక్‌కు గురై మహిళ మృతి చెందింది. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలం పెర్కివీడుకు చెందిన అంజమ్మ (38) గురువారం సాయంత్రం పశువులకు పశుగ్రాసం కోయడానికి శివారులోని పొలంలోకి వెళ్లింది. అప్పటికే వర్షానికి పొలంలో తెగిపడ్డ వైర్లు ఆమెకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త, కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త బాల్‌రాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రాజాపూర్, సెప్టెంబరు 6: మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలంలోని జాతీయ రహదారి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి పక్కన వ్యక్తి మృతి చెంది ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్ ప్యాంటు, నలుపు, ఎరుపు కలర్ షర్ట్ ధరించి ఉన్నాడని, ఎవరైనా గుర్తుపడితే 8712659347 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

క్రమశిక్షణ, పట్టుదలతోనే విజయం

» అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వై.జానకి



సమావేశంలో మాట్లాడుతున్న వై.జానకి

వనపర్తి రూరల్, సెప్టెంబరు 6 : క్రమశిక్షణ పట్టుదల ఉంటేనే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమని, బద్ధకంతో ఎలాంటి విజయాలను పొందలేమని రెండవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వై.జానకి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కులు, బాధ్యతలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో మంచిచెడులు ఉన్నాయని, మంచి మార్గం వైపు పయనించాలని సూచించారు. స్మార్ట్ ఫోన్‌లోని మంచిని గుర్తించి విజ్ఞానాన్ని పొందితేనే బంగారు భవిష్యత్ ఉంటుందని వివరించారు. సేవాభావాన్ని చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని, తల్లిదండ్రులు చొరవ చూపాలని పేర్కొన్నారు. పిల్లలు నిజ జీవితంలో ఎలా ఉండాలో ఆమె వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఉత్తరయ్య, అసిస్టెంట్ శ్రీదేవి, హెచ్‌ఎం తారాబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

పాన్‌గల్, సెప్టెంబరు 6 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, వనపర్తి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో 'బాలల హక్కులు, రక్షణ చట్టాలు' అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలల సంక్షేమ సమితి సభ్యుడు విష్ణు, బాలల పరిరక్షణ విభాగం పోషల్ వర్కర్ నరేందర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలు అందిస్తున్న సర్వీసులు, బాల్య వివాహాల నిషేధ చట్టం-2006, బాలల అక్రమ రవాణా నిరోధక చట్టం-2012, మంచి, చెడు స్పర్శ యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం, తల్లిదండ్రులు కోల్పోయి చదువుకుంటున్న బాలలకు స్పాన్సర్‌షిప్ పథకం అందిస్తున్న సేవలు, బాలల సంక్షేమ సమితి ద్వారా అందిస్తున్న సర్వీసుల గురించి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 112, 100 అంశాలపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కబ్జాదారు నుంచి భూమిని విడిపించాలి



భూమిని ఇప్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ఆత్మకూరు, సెప్టెంబరు 6 : కబ్జా చేసిన వ్యక్తి నుంచి తమ భూమిని తమకు విడిపించాలని కోరుతూ తహసీల్దార్ రాజుకు బాధితులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆత్మకూరు పట్టణ శివారులోని 241 సర్వే నెంబర్‌లో మూడెకరాల ఆరు గుంటల భూమిలో దండు రామకృష్ణ, దండు శ్రీనివాసులు, దండు లక్ష్మీ, దండు సంతోషమ్మ, దండు భగవంతు, చెట్ల శ్రీనివాసులు, చెట్ల చంద్రమ్మ, చెట్ల వెంకటన్న, చెట్ల రవి, చెట్ల జమ్ములు, చెట్ల కుమార్ అనే 11 మంది గత 30 సంవత్సరాలుగా పట్టాదారులుగా ఉన్నారు. ఈ మధ్యకాలంలో పట్టణానికి చెందిన మొగిలి గంగాధర్‌గౌడ్ అనే వ్యక్తి కబ్జా చేసుకుని తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. కబ్జాదారు చెర నుంచి తమ భూమి తమకు ఇప్పించాలని బాధితులు వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు

పెద్దమందడి, సెప్టెంబరు 6 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం మండలంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే పెద్దమందడి మండల జట్లను ఎంపిక చేశారు. ఎంపికలకు మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీలతో పాటు, మనిగిల్ల, వెల్టూరు, మోజర్ల, మద్దిగట్ల, బలిజపల్లి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి దాదాపు 250 మంది క్రీడాకారులు హాజరయ్యారు. మండల స్థాయి సెలక్షన్‌లను జీహెచ్‌ఎం శాంతన్న ప్రారంభించారు. వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు మన్యంయాదవ్, అనిల్‌కుమార్, రవికుమార్, వెంకటేశ్వరరావు, శ్రీరాములు, కిశోర్, మంజుల, అరుణ, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జబ్బార్

మదనాపురం, సెప్టెంబరు 6 : రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జబ్బార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అజ్జకొల్లు గ్రామంలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ వరదలు వస్తే బీజేపీ పాలిత రాష్ట్రాలకు వెంటనే ఆర్థిక సాయం ప్రకటిస్తారన్నారు. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికి కేంద్ర నాయకత్వాన్ని నిలదీసి ఎందుకు నిధులు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. అకాల వర్షాల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని ప్రతీ ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వర్షాల వల్ల మరణించిన వారికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కూలిపోయిన ఇళ్లకు, చనిపోయిన పశువులను లెక్కించి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో నిల్వ ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి వెంకట్రాములు, వెంకటేష్, చెన్నయ్య, విష్ణు, మనివర్ధన్ పాల్గొన్నారు.

హమాలీలకు కూలి రేట్లు పెంచాలి



సివిల్ సప్లయ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న హమాలీలు

కొత్తకోట, సెప్టెంబరు 6 : కూలి రేటు పెంచాలని పట్టణంలోని సివిల్ సప్లయ్ కార్యాలయం ముందు హమాలీలు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ మాట్లాడుతూ గతేడాది ఒప్పందం ప్రకారం చేసుకున్న మేరకు క్వింటాల్‌కు రూ.35 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దసరా స్వీట్స్‌ను రూ.1200, బోనస్ రూ.10 వేలు, యూనిఫాంకు ఇచ్చే నగదును రూ.రెండు వేలకు పెంచాలన్నారు. హమాలీ నుంచి దిగిపోయిన కార్మికులకు పెన్షన్ చెల్లించాలని కోరారు. నిరసనలో హమాలీలు రాజు, బాలయ్య, శాంతన్న, కుమార్, చిన్నబాలయ్య, పెద్దబాలయ్య, ధనుంజయ తదితరులున్నారు.

ఘనంగా బోనాల పండుగ

కొత్తకోట, సెప్టెంబరు 6 : మండలంలోని కనిమెట్ట గ్రామంలో కాళికాదేవి బోనాల పండుగను శుక్రవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆభరణాలను పూజారి ఇంటి నుంచి దేవాలయం వరకు బాజాభజంత్రీ, భక్తుల భక్తిపాటల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. సాయంత్రం మహిళలు బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు కోళ్లతో, కొబ్బరికాయలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆభరణాల ఊరేగింపులో మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మాజీ సర్పంచు గాదంరాణి, నాయకులు సంజీవాచారి, బాలరాజు, మల్లేష్, రామచంద్రయ్యయాదవ్, ప్రభాకర్‌రెడ్డి, పరమేష్, కోటేశ్వర్‌రెడ్డి, యాదగిరి, బాలయ్య, సంజీవరెడ్డి, భాస్కర్, బ్రహ్మయ్యచారి, కృపాకర్‌రెడ్డి, గోపాల్, నాగేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

పరిసరాల శుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

» సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం » గణప సముద్రం చెరువు కట్ట పనులు వేగవంతం చేయాలి
» కలెక్టర్ ఆదర్శ్ సురభి » కర్నెతండాలో అభివృద్ధి పనుల పరిశీలన



ఖిల్లాఘణపురం కస్తూర్బా పాఠశాల వెనుక వైపు అపరిశుభ్రంగా ఉన్న స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 6 : పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా ఇంగ్లిష్, తెలుగు మీడియం పాఠశాలలను, గణపసముద్రం జలాశయం చెరువు కట్ట పనులను, డంపింగ్ యార్డును, కర్నెతండాలోని వృద్ధాశ్రమం భవనం నిర్మాణ పనులను, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. కస్తూర్బా తెలుగు మీడియం పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న శ్రావ్య అనే విద్యార్థినికి డెంగీ సోకడంతో పాఠశాల ఆవరణలో ఉన్న చెత్తను, నీటి నిల్వ ప్రాంతాలను చూసి మండల అధికారులకు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అదేవిధంగా, పాఠశాలలకు వచ్చే సరుకుల నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కస్తూర్బా పాఠశాల పక్కనే రోడ్డుపై ఉన్న డంపింగ్ యార్డు వల్ల దుర్వాసన వస్తోందని గ్రామస్థులు తెలపడంతో కలెక్టర్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కర్నె తండాలో నిర్మాణంలో ఉన్న వృద్ధాశ్రమం భవనం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, బడ్జెట్ కేటాయించనున్నట్లు తెలిపారు. గణపసముద్రం చెరువుకట్ట అభివృద్ధి పనుల వివరాలను ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉన్న నేపథ్యంలో వైద్య సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరాలు వచ్చిన రోగుల వద్ద రక్త నమూనాలు సేకరించి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సుధీర్, తహసీల్దార్ పాండు, ఎంపీడీవో వెంకటాచారి, ఎంఈవో ఉషారాణి, ఎంపీవో రాజు, మండల వైద్యాధికారి ప్రవీణ్, మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, ఇరిగేషన్ డీఈ నరేందర్‌రెడ్డి, ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ డీఈ ప్రమోద్, ఏఈ రమేష్‌నాయుడు, కస్తూర్బా పాఠశాల ఎస్‌వోలు ప్రశాంతి, లలిత, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దమందడి : రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. శుక్రవారం పెద్దమందడి మండలంలోని జంగమాయపల్లి గ్రామంలో కలెక్టర్ రైతులతో మాట్లాడారు. రైతుల దరఖాస్తులను వ్యవసాయాధికారులు ఆన్‌లైన్ చేస్తున్న విధానాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి, ఆందోళన పడొద్దని సూచించారు. అనంతరం గ్రామ పరిసరాలను పరిశీలించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య పనులను నిరంతరం కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందునాయక్, ప్రత్యేకాధికారి సుధీర్‌రెడ్డి, మండల అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

బియ్యం ఇవ్వని మిల్లర్లపై చర్యలు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా : ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు బియ్యం ఇవ్వని మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ ఛాంబర్లో సివిల్ సప్లయ్ అధికారులతో సీఎంఆర్ రైస్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం ఇస్తున్న మిల్లర్లను కలెక్టర్ ప్రశంసించారు. బియ్యం ఇవ్వకుండా మొండిగా ఉన్న అబ్రార్ ఇండస్ట్రీ, సత్య ఇండస్ట్రీ, తిరుమల ఇండస్ట్రీ, శ్రీవెంకటేశ్వర ఇండస్ట్రీలపై కేసులు నమోదు చేయాలని సివిల్ సప్లయ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కాలయాపన చేస్తున్న సివిల్ సప్లయ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ నగేష్ కు సూచించారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి కాశీ విశ్వనాథ్, డీఎం ఇర్ఫాన్, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల కట్టడి

» అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్



తెల్లరాళ్లపల్లిలో డ్రై డే పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

పాన్‌గల్, సెప్టెంబరు 6 : ప్రతీ ఒక్కరు పరిశుభ్రతను పాటిస్తే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బండపల్లి, తెల్లరాళ్లపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పక్కన మురికిగా ఉన్నటువంటి కుటుంబాలకు నోటీసులు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అదేవిధంగా ఇళ్ల మధ్యలో పిచ్చిమొక్కలు, మురుగునీరు నిల్వ ఉన్న ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చి తొలగించేలా చూడాలని ఎంపీడీవో గోవిందరావును ఆదేశించారు. ప్రతీ గ్రామ పంచాయతీలో ఫాగింగ్ చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న అదనపు గదులు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారిణి, డీఆర్డీవో పీడీ ఉమాదేవి, తహసీల్దార్ సుభాష్‌నాయుడు, ఎంపీవో రఘురాం, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

సురక్షితమైన నీటిని తాగాలి

వీపనగండ్ల : మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఎంపీడీవో శ్రీనివాసరావు శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. డ్రై డే సందర్భంగా గ్రామంలో పర్యటించి నీళ్ల నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు తెలిపారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హేమవర్దన్, ఏఎన్‌ఎంలు గీత, మల్లేశ్వరి తదితరులున్నారు.

జ్వరం వస్తే రక్త పరీక్షలు చేయించుకోవాలి

» డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.శ్రీనివాసులు



మెట్టుపల్లిలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాసులు

వనపర్తి వైద్యవిభాగం, సెప్టెంబరు 6 : జ్వరం వస్తే ప్రభుత్వ ఆస్పత్రిలో తప్పకుండా రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వనపర్తి అర్బన్ మెట్టుపల్లిలో ఫ్రైడే డ్రైడేను పురస్కరించుకొని డెంగీ పాజిటివ్ కేసు నమోదైన ఇంటిని ఆయన పరిశీలించారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇంటిలోని నీటి పాత్రలను, వాటిలో ఉండే దోమ లార్వాను పరిశీలించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కంచె రవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్‌జీ, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, బ్రీడింగ్ చెక్కర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా, పట్టణంలోని 32వ వార్డు కేడీఆర్ నగర్‌లో స్థానిక కౌన్సిలర్ పెండెం నాగన్నయాదవ్ ఆధ్వర్యంలో వైద్యాధికారులు డ్రైడే నిర్వహించారు. నిల్వ నీటి పాత్రలను పరిశీలించి, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్పీ లక్ష్మి, ఆశ కార్యకర్త మాధవి, వార్డు మహిళలు పాల్గొన్నారు. 30వ వార్డులో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఆధ్వర్యంలో డ్రైడే నిర్వహించారు. కాలనీలోని రాజీవ్ గృహకల్ప, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో తిరిగి డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధులపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. వార్డులోని డ్రైనేజీ, మురుగు నీటి ప్రాంత్రాల్లో బ్లీచింగ్ చల్లించి శుభ్రం చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ వైష్ణవి, సూపర్‌వైజర్ సత్యమ్మ, నిర్మల, ఆశ వర్కర్ శ్యామల ఉన్నారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పారిశుధ్య పనులు



ఆత్మకూర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆత్మకూరు : ఫ్రై డే డ్రై డే సందర్భంగా ఆత్మకూర్ పట్టణంతో పాటు, గ్రామాల్లో పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయి. పట్టణంలో శుక్రవారం మునిసిపల్ చైర్‌పర్సన్ గాయత్రి పారిశుధ్య పనులను పరిశీలించి, గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కాలనీల్లో వర్షపు నీరు చేరితే పారిశుధ్య కార్మికులకు సమాచారం అందించాలని తెలిపారు. రోజువారీగా తాగే నీటిని వేడి చేసుకుని తాగాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడి వ్యాధుల బారిన పడకుండా ఉండాలని పదో వార్డు కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నాగరాజు, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, కౌన్సిలర్ తబస్సుమ్ బేగం తదితరులున్నారు. ఆరేపల్లి గ్రామంలో మండల పంచాయతీ అధికారి శ్రీరామ్‌రెడ్డి పారిశుధ్య పనులను పరిశీలించారు.

పరిశుభ్రతకు అరగంట కేటాయించండి

» జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి



బాలుర వసతిగృహంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బీరం సుబ్బారెడ్డి

వనపర్తి రూరల్, సెప్టెంబరు 6 : ప్రతీ ఆదివారం ఒక అరగంట పరిసరాల పరిశుభ్రతకు కేటాయించి, ఆరోగ్యంగా ఉండాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి బీరం సుబ్బారెడ్డి అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని నాగవరం ప్రభుత్వ బీసీ, ఏ, బి బాలుర వసతి గృహాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల చేత ప్రార్థన చేయించి వారికి అల్పాహారాన్ని వడ్డించారు. అనంతరం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఎటువంటి వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించాలని వసతిగృహ సంక్షేమ అధికారి ఆంజనేయులుకు ఆదేశించారు.

కూలిన ఇళ్లను పరిశీలించిన తహసీల్దార్

శ్రీరంగాపురం, సెప్టెంబరు 6 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిపోయిన ఇళ్లను తహసీల్దార్ మురళీగౌడ్ పరిశీలించారు. పలు గ్రామాల్లో ఆయన ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. మండలంలో 21 ఇళ్లు కూలిపోయినట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రాధాకృష్ణ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి వరద సాయం అందజేత

శ్రీరంగాపురం, సెప్టెంబరు 6 : ఇటీవల కురిసిన వర్షాలకు ఇల్లు కూలి మృతి చెందిన తాటిపాముల గ్రామ వాసి వడ్డె చంద్రయ్య కుటుంబానికి వరద సాయం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు మంజూరు చేసింది. మంజూరైన చెక్కును శుక్రవారం తహసీల్దార్ మురళి బాధిత కుటుంబానికి వెళ్లి అందజేశారు. అదేవిధంగా డబుల్ బెడ్‌రూం కూడా ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు శ్రీహరిరాజు, దాడి యోగారెడ్డి, రాజునాయక్, బీరం రాజశేఖర్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



గోపల్‌దిన్నెలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పాన్‌గల్, సెప్టెంబరు 6 : మండల కేంద్రంలోని బాలుర వసతిగృహం, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శుక్రవారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు పరిశుభ్రతను పాటించి మురుగునీరు నిల్వ ఉండకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా పరిశుభ్రతను పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ తారాశశాంక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్ రాంచంద్రయ్య, సూపర్‌వైజర్ శాంతమ్మ, ఏఎన్‌ఎం నర్సమ్మ తదితరులున్నారు.

గోపల్‌దిన్నెలో వైద్య శిబిరం

వీపనగండ్ల : మండల పరిధిలోని గోపల్‌దిన్నె గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు వచ్చిన వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి పరీక్షలు చేశారు. సీజనల్ జ్వరాలు వచ్చినట్లు నిర్ధారించి మందులను పంపిణీ చేశారు. దోమల వల్ల విషజ్వరాలు వస్తున్నాయని, దోమ కాటుకు గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రాజశేఖర్ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, కేశవులు, సిబ్బంది జహంగీర్, వెంకటేష్, సునందన, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఖిల్లాఘణపురం/పెద్దమందడి, సెప్టెంబరు 6 : ఖిల్లాఘణపురం మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం సింగిల్ విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 34 మందికి మంజూరైన చెక్కులను ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ క్యామ వెంకటయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు తీనేటి రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ క్యామరాజు, డైరెక్టర్ సాయిచరణ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్యామ్‌సుందర్‌రెడ్డి, కృష్ణయ్యయాదవ్, రాములునాయక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పెద్దమందడి మండలం మద్దిగట్లలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు కె.సత్యారెడ్డి, ఆర్.రామచంద్రగౌడ్, మాజీ సర్పంచు పి.నారాయణ, ఉప సర్పంచులు కేశవగౌడ్, శివరాజ్, నాయకులు ఉన్నారు.

అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయి



జీహెచ్‌ఎం పలుస శంకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 6 : అవార్డులు అధికారులకు మరింత బాధ్యతను పెంచుతాయని జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, గణేష్‌కుమార్‌లు అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డును అందుకున్న జీహెచ్‌ఎం పలుస శంకర్‌గౌడ్‌ను బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో డీసీఈబీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, హెచ్‌ఎంలు శంకరయ్య, ఉమాదేవి, వరలక్ష్మి, సరస్వతి, రమాకాంత్, శ్రీకాంత్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, నరేందర్, శివయ్య కృష్ణనాయక్, విష్ణు, మల్లికార్జున్, సేవ్యానాయక్, శాంతన్న తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

అమరచింత/శ్రీరంగాపురం/పాన్‌గల్ : అమరచింతలోని దేశాయ్ మురళీధర్‌రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు దేశాయ్ ప్రకాష్ రెడ్డి సేవా సమితి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం కళావతమ్మ, ఉపాధ్యాయులు పద్మమ్మ, రాములు, ఆనందలక్ష్మి, హరిత, జ్యోతి, శ్రావణి, మాసంబి, శ్రీలతను సత్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ సయ్యద్ కలాంపాషా, రిటైర్డ్ టీచర్ షేక్‌అహ్మద్, బాలకృష్ణ ఉన్నారు. అదేవిధంగా, శ్రీరంగాపురం మండలం వెంకటాపురంలో మోహన్ గౌడ్‌ను గ్రామస్థులు సన్మానించారు. పాన్‌గల్ మండలం చింతకుంట జడ్పీహెచ్‌ఎస్‌లో పి.రాములును తోటి ఉపాధ్యాయులు సన్మానించారు.

మట్టి గణపతులను పూజిద్దాం

కొత్తకోట, సెప్టెంబరు 6 : పర్యావణాన్ని కాపాడేందుకు మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటుచేసి పూజిద్దామని మాజీ ఎంపీపీ గుంత మౌనిక అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆమె మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌తరాల ప్రజల మనుగడ సాగాలంటే ఇప్పటినుంచే కాలుష్య రహిత పర్యావరణాన్ని నిర్మిద్దామన్నారు. సహజ సిద్ధమైన పూలను పూజలో వినియోగించి చెరువులు, కుంటలను రక్షించుకోవాలని కోరారు. యుగంధర్‌రెడ్డి, జగతయ్య, పరమేష్ తదితరులున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

» స్కాలర్స్ కళాశాల యజమాన్య సభ్యులు



ఫ్రెషర్స్ పార్టీలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 6 : విద్యార్థులు స్వయంకృషితో ఎదిగి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని స్కాలర్స్ విద్యా సంస్థల యాజమాన్య సభ్యులు డాక్టర్ పి.జగదీశ్వర్, డాక్టర్ జి.వరప్రసాదరావు, బి.నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్ విద్యార్థులకు సందేశం ఇచ్చారు. శుక్రవారం వనపర్తిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గత 33 సంవత్సరాలుగా స్కాలర్స్ విద్యాసంస్థల నుంచి విద్యాభ్యాసం చేసిన వారు డాక్టర్లు, ప్రొఫెసర్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ తదితర హోదాల్లో ఉన్నారని, ప్రజాప్రతినిధులుగా కూడా రాణిస్తూ సమాజానికి సేవలు అందిస్తున్నారని అన్నారు. విద్యార్థుల్లో దురలవాట్లు పతనానికి కారణం అవుతాయని, నేటి టెక్నాలజీ జీవితంలో ఎదగడానికి దోహదం చేయాలి గానీ భవిష్యత్ అధోగతిపాలు కావడానికి దుర్వినియోగం చేయొద్దని విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నాటకాలు, డ్యాన్సులతో ప్రథమ సంవత్సరం విద్యార్థులను అలరింపజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, విజయ్‌కుమార్, కిష్టారెడ్డి, రవికుమార్, మల్లారెడ్డి, అనిల్‌కుమార్, కిశోర్, తిరుపతయ్య, పద్మ, సునీత తదితరులున్నారు.

విద్య, వైద్యాన్ని బలోపేతం చేయాలి

వనపర్తి టౌన్, సెప్టెంబరు 6 : జిల్లాలో ప్రభుత్వ విద్య, వైద్యాన్ని బలోపేతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరపాగ రామకృష్ణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసిన ఆ పార్టీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల్లో ధర్మ సమాజ్ పార్టీ తరపున పీహెచ్‌సీలు, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించామన్నారు. అయాచోట్ల పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నాయకులు అశోక్, మన్యం, బలరాం, ఈశ్వర్, కురుమయ్య తదితరులున్నారు.